
# గుండె గొంతుక ఒక్కటే



ఎం.ఎస్.రెడ్డి

ఉదయం పది గంటలవుతోంది. అప్పుడప్పుడే మా ఆఫీసు స్టాఫ్ అంతా తమ తమ సీట్లలో కూర్చొని పనిలో నిమగ్నమవుతున్నారు. శంకరం తప్ప అంతా వచ్చేసినట్లే. సాధారణంగా శంకరం ఆఫీసుకు, ఆలస్యంగా వచ్చే రోజులు తక్కువ. ఈ రోజెందుకో, ఇంకా వచ్చినట్టులేదు. శంకరం సీటు, నా ప్రక్క సీటే. నేను యు.డి.సి.గా పని చేస్తున్నాను. శంకరం ఎల్.డి.సి. శంకరం వచ్చాడు. 'నమస్తే' అని విష్ చేసి తన సీట్లో కూర్చొని పనిలో నిమగ్నమయ్యాడు.

శంకరం మనిషి సన్నగా ఉంటాడు. కాస్త నలుపే అయినా ఆకర్షించే ముఖం, తగినంత ఎత్తు, ప్రక్కకు దువ్విన క్రాఫుతో ఉంటాడు. శంకరం ఊరు అనంతపురం జిల్లాలోఓ చిన్న పల్లెటూరు. భార్య ఇద్దరు పిల్లలు. స్వభావ రీత్యా మితభాషి అయిన శంకరం, ఇతర ఉద్యోగుల కంటే మౌనంగా తన పని తాను చేసుకుపోయే స్వభావం కలవాడు. అందువల్లనేమో శంకరం అంటే నాకు ప్రత్యేకమయిన అభిమానం. సహజంగా ఇంట్రావర్ట్ అయిన శంకరం, ఎప్పుడైనా, చిర్నవ్వుతో మాట్లాడేది ఒక్క నాతోనే. కానీ ఆ రోజెందుకో మనిషి అదోలా ఉన్నాడు. ముఖం కూడా కాస్త చికాకుగానే ఉన్నట్టు కనిపించింది. మాసిన గడ్డం, కళ్ల క్రింద నలుపు, ఏదో మానసిక సంఘర్షణలో నలుగుతున్నట్టు కనిపించాడు.

సాత్వికుడు, ఆదర్శ భావాలు గల శంకరం, మానసికంగా నలిగే సందర్భాలంటూ ఉంటే అవి "ఆదర్శాలకు నైతిక విలువలకు, నాగరికతా విలువల వల్ల వచ్చే డీవియేషన్స్ వల్లే" అయ్యుంటుందని నా అభి

ప్రాయం. శంకరంతో నా పరిచయం ఇప్పుడిప్పుడే స్నేహం నుండి ఆత్మీయతగా మారుతోంది. అతనలా ముభావంగా, ఏదో తెలియరాని సంఘర్షణలో ఉంటే, నాకు సహజంగానే విషయం ఏమిటో, తెలిసుకోవాలనిపించింది. వీలైతే నాకు చేతనైనంత సహాయం చేయాలనిపించింది. మరుక్షణమే విషయమేమిటో అడగాలనుకొని శంకరం వైపు చూశాను. అతను పనిలో మునిగినట్టు కనిపిస్తున్నాడు. ఉహూ౦... ఏదో అస్థిమితం స్పష్టంగా కనిపిస్తోంది. లంచ్ అవర్లో అడగాలనుకొని, ప్రస్తుతానికి వద్దనుకొని నా పనిలో నేను నిమగ్నమయ్యాను.

మధ్యాహ్నం రెండు గంటలవుతోంది. లంచ్ ముగించుకొన్న తరువాత ఆఫీసు బయట, వేపచెట్టు క్రింద ఉన్న, పాన్ బంకు దగ్గరికెళ్ళి సిగరెట్ ముట్టించడం నాకు మా ఆఫీసులో మరో ముగ్గురికి అలవాటే. ఆ ముగ్గురిలో శంకరం కూడా ఒక్కడు. అప్పటికే సిగరెట్ వెలిగించి వేపచెట్టు క్రింద నిలుచొని దీర్ఘంగా ఆలోచిస్తున్న ముఖంతో కనబడ్డాడు శంకరం. నేను కూడా వెళ్ళి సిగరెట్ వెలిగించి, వేపచెట్టు వద్ద నిలుచున్న శంకరం దగ్గరికి వెళ్ళాను. ఆకాశం మేఘావృతం అయి ఉంది. శంకరంతో ఏదో ఒకటి నేనే మొదలు పెట్టాలనిపించి,

"శంకరం వర్షం పడేటట్లు ఉంది కదూ?" అన్నాను.

'అవునన్నట్టు' ముక్తసరిగా తలూపి, తలవంచుకొని ఆలోచిస్తూండిపోయాడు.

ఇక తప్పదు సూటిగా విషయం అడగాలనిపించి -

"శంకరం ఏమనుకోకపోతే, ఒక విషయం. నీ వ్యక్తిగత విషయాలు అడిగేటంత చనువూ, ఆత్మీయతా నాకున్నాయనుకుంటే నిన్నొక విషయం అడగాలని ఉంది" అన్నాను.

తలెత్తి నావైపు చూసి అడగమన్నట్టుగా తల ఊపాడు. అలా చూసినపుడు అతని విశాలమయిన కళ్ళలో ఎరుపు జీరలు స్పష్టంగా కనిపించాయి. నేనడిగాను-

" ఏదో సంఘర్షణలో నలుగుతున్నట్టున్నావు. గత నాలుగు రోజుల నుండి నేను చూస్తున్నాను. సమస్యేమిటో కావలసిన వారితో చెబితే, కాస్త ఊరట దొరుకుతుందంటారు. సాటి ఉద్యోగిగా నిన్నభిమానించే వ్యక్తిగా, నాకు చేతననయినంత సహాయం చేయగలను. అది మానసికమైనా, ఆర్థికమైనా, సామాజికమయినా సరే" అన్నాను.

అంతవరకూ తలొంచుకొని ఉన్న శంకరం నా వైపు భావరహితంగా చూసి,

" మీ కభ్యంతరం లేకపోతే, సాయంకాలం, అలా బయటకెళ్ళి మాట్లాడుకుందాం" అన్నాడు. 'సరేనని' నా అంగీకారం తెలిపాను.

ఇద్దరం ఆఫీసులోకి వెళ్ళాం.

సాయంకాలం ఆరు గంటలు కావస్తోంది. పార్కుకెళ్ళి ఒక మూల బెంచీ మీద ఇద్దరం కూర్చున్నాం. శంకరం సిగరెట్టు వెలిగించి, చెప్పడం ప్రారంభించాడు.

" నేను, కుమార్ ఇద్దరం చిన్నప్పటి నుండీ స్నేహితులం. ఇద్దరం ఒకేసారి డిగ్రీ పూర్తి చేయడం, ఆ తరువాత గ్రూప్-4 పాస్ కావడం, ఒకేసారి ఉద్యోగం రావడం, నెల రోజుల తేడాతో ఇద్దరి పెళ్ళిళ్ళు కూడా జరిగాయి. కుమార్‌కూడా ఇక్కడే వేరొక డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాడు. ఇంట్రావర్ట్‌నైన నాకు, ఆత్మీయుడు, ప్రాణ స్నేహితుడు అయిన కుమార్ సాన్నిహిత్యం నాకెంతో ఆనందాన్నిచ్చేది. వీలైతే రోజూ వాళ్ళింటికెళ్ళేవాడ్ని. కుమార్ కూడా మా ఇంటికే తన భార్యను తీసుకొని వచ్చేవాడు. వాళ్ళిద్దరూ నా భార్య నేను కలిసి హాయిగా కబుర్లు చెప్పుకొనే వాళ్ళం. అంతేకాదు, కుమార్ నాకు దూరపు బంధువు కూడా.

> **మానవ సంబంధాలలో విలువలు తగ్గిపోతున్న మాట వాస్తవమే. ఏ బంధంలో అయినా అది స్నేహం కావొచ్చు. ప్రేమ కావొచ్చు, భార్యాభర్తల బంధం కావొచ్చు 'నమ్మకం' అనేది ప్రధానం. ఈ నమ్మకం అనే గోడ బీటలు వారినపుడు నైతిక విలువలున్న ఏ వ్యక్తి అయినా నీలా బాధపడటం సహజమే. ఇందులో నీవు ఒక పావు మాత్రమే.**

కాల ప్రవాహంలో మూడు సంవత్సరాలు గడిచిపోయాయి.

నా భార్య రెండో కాన్పుకు పుట్టింటికి వెళ్ళింది. నేనొక్కడినే రోజూ హోటల్‌లో భోంచేసి, ఆఫీసుకు వస్తున్నాను. వారం క్రితం కుమార్ ఆఫీసు పనిమీద హైదరాబాదు వెళుతూ,

" నేను నాలుగు రోజులు రాను నా భార్య సుమిత్రకు తోడుగా ఉండు, రాత్రిపూట తను ఒంటరిగా ఉండడానికి భయపడుతుంది" అని చెప్పి వెళ్ళాడు.

మూడు రోజులు మామూలుగానే గడిచిపోయాయి.

నాలుగో రోజు రాత్రి పరిస్థితులు ఎలాంటివైనా కానీ, ప్రేరేపింపబడిన మోహం వల్లనైతేనేమి, యాదృచ్ఛికంగా అయితేనేమి కుమార్ భార్య నేనొక్కటయ్యాం. ఆ తరువాత ఎందుకో నాలో విపరీతమైన సంఘర్షణ ప్రారంభమయ్యింది. నా వ్యక్తిత్వం మీద విపరీతమైన ద్వేషం కలగసాగింది. నా ఆదర్శాల మీద, నా విలువల మీద నాకు విపరీతమయిన నమ్మకం, అభిమానం ఉండేవి. కానీ ఆ సంఘటన తరువాత నన్ను నేను ద్వేషించుకోవడం ప్రారంభించాను. ఐదవ రోజు సాయంత్రం కుమార్ వచ్చి తన భార్య సుమిత్రకు తోడున్నందుకు కృతజ్ఞతలు చెబుతున్నప్పుడు ఆత్మవంచనా పూరితంగా నేను నవ్విన నవ్వు గుర్తొస్తూంటే, ఏదో అధః పాతాళానికి పడిపోయినట్టుగా అనిపించింది. నాకు తెలియకుండానే నా భార్య మీద కూడా సంస్కారరహితమైన ఆలోచనలు రావడం ప్రారంభమయ్యాయి. అంతేకాదు ఇప్పుడు నా ఇంటికి వస్తున్న బంధువులను, స్నేహితులను కూడా మామూలుగా చూడలేకపోతున్నాను. జరిగిన సంఘటనలో నా పాత్ర ఎంతయినా, మొత్తం నా ప్రశాంత మానసిక ప్రపంచాన్ని తల్లక్రిందులు చేసింది"

అంటూ, ఖర్చీఫ్‌తో కళ్ళు తుడుచుకుని చిన్నగా ఏడ్వడం ప్రారంభించాడు. కాసేపు ఓదార్చాను.

ఒక నైతిక సంపన్నుడైన వ్యక్తి జీవనయానంలో, అకాల వర్షంలాంటి, ఇలాంటి సంఘటనలు ఎంత విధ్వంసాన్ని సృష్టిస్తాయో ప్రస్తుతం శంకరం మానసిక స్థితి చూస్తే అర్థమవుతూంది. కొంత సేపటి తరువాత ఇలా అన్నాను.

" శంకర్! నిజమే మన ఆనందం అనేది మన నైతిక విలువల మీదనే ఆధారపడివుంటుంది. మానవ సంబంధాలలో విలువలు తగ్గిపోతున్న మాట వాస్తవమే. ఏ బంధంలో అయినా అది స్నేహం కావొచ్చు. ప్రేమ కావొచ్చు, భార్యాభర్తల బంధం కావొచ్చు. 'నమ్మకం' అనేది ప్రధానం. ఈ నమ్మకం అనే గోడ బీటలు వారినపుడు నైతిక విలువలున్న ఏ వ్యక్తి అయినా నీలా బాధపడటం సహజమే. ఇందులో నీవు ఒక పావు మాత్రమే. నిన్ను వ్యక్తులు ప్రేరేపించినా, పరిస్థితి ప్రేరేపించినా మోహం అనే బలమైన హస్తం నిన్నీ సంఘటనలో పాత్రను చేసింది. నిజమైన పశ్చాత్తాపమే పాప పరిహారం కావొచ్చు, కానీ ఇలాంటి మనసుకయ్యే గాయాలు కాలంతో మానాల్సిందే. నీవీ పరిస్థితి నుండి బయటపడాలంటే ఆ సంఘటనలోని పరిసరాలకు, పాత్రలకు వీలైనంత దూరంగా వెళ్ళిపోవడమే. ఇది నీతో ప్రారంభం కాదు, ఆది నుంచీ వస్తూ ఉన్నదే. తపో సంపన్నులైన మహారుషుల నుండీ సామాన్యుల వరకూ మోహం దెబ్బకు బలి అవుతూ వస్తూనే ఉన్నారు. కొన్ని బాధాకరమయిన వర్తమాన ఘడియలు గతమై బాధపెడుతూంటే, మనం చేయవలసిందల్లా అలాంటి సంఘటనల్లో ఇంకెప్పుడూ 'నన్ను యాదృచ్ఛికంగానైనా పాత్రను చేయొద్దని' కనిపించని దేవుని వేడుకోవడమే"

అని చెప్పడం ఆపాను.

" చీకటి పడుతోంది ఇక వెళ్దామా శంకరం!" అన్నాను.

ఇద్దరం ఇళ్ళకు బయలుదేరాం.

అయినా ఈ వేదనంతా శంకరం లాంటి వాళ్ళకే. గుండె... గొంతుక ఒక్కటైన వాళ్ళకే ఈ బాధంతా..

నెల రోజుల తరువాత శ్రీకాకుళంకు బదిలీ మీద వెళ్తూన్న శంకరానికి వీడ్కోలు చెప్పడానికి ప్లాట్‌ఫాం మీద నిలబడ్డాను కదులుతున్న రైలులోని శంకరానికి చెయ్యి ఊపుతూన్నపుడు. నా కనుల నుండీ రాలిపడ్డ కన్నీటి చుక్క బుగ్గల మీదికి జారినపుడు అనిపించింది.

"విధి ఎంత విచిత్రమైంది. ఒకే సంఘటన ఒకరికి విషాదాన్నిచ్చి, మరొకరికి ఆనందాన్నిచ్చి, కొందరికి ఎడబాటునిచ్చి. ●